సాక్షి
నిజామాబాద్
గురువారం ♦ 11 ♦ ఏప్రిల్ ♦ 2024



## నేడు రంజాన్



జిల్లా కేంద్రంలోని ఖిల్లా ఈద్గా వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు

నెలవంక కనిపించడంతో ముస్లింలు గురువారం రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలను ముస్తాబు చేశారు. ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /24.5

**వాతావరణం**
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: రంజాన్ పండుగ సందర్భంగా గురువారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు పోలీస్‌కమిషనర్ కల్మేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పండుగ రోజు ఖిల్లా, బోధన్ బస్టాండ్, పులాంగ్ ఈద్గాలలో ముస్లింలు ప్రార్థనలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని పేర్కొన్నారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు. బోధన్ వైపు వెళ్లే వారు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి, శివాజీ చౌక్, గంజ్, నిజాంకాలనీ మీదుగా అర్సపల్లి నుంచి బోధన్‌కు వెళ్లాలన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లేవారు మాధవనగర్ బైపాస్ నుంచి కంఠేశ్వర్ బైపాస్, కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా బోధన్‌కు వెళ్లాలని పేర్కొన్నారు. బోధన్ నుంచి నిజామాబాద్ వచ్చేవారు అర్సపల్లి సర్కిల్ నుంచి కలెక్టరేట్ మీదుగా కంఠేశ్వర్ బైపాస్, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

### 1,726 ఎకరాల్లో పంటనష్టం

- అంచనా వేసిన వ్యవసాయ శాఖ



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఈ నెల 8న కురిసిన వడగళ్ల వర్షానికి మొత్తం 1,726 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఇందులో 910 మంది రైతులు పంటలను నష్టపోయారని గుర్తించారు. ఈ మేరకు బుధవారం డీఏవో వాజిద్ హుస్సేన్ పంటలను పరిశీలించారు. వడగళ్ల ధాటికి అత్యధికంగా 1,641 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. మామిడి 60 ఎకరాల్లో, అలాగే జొన్న, బొప్పాయి, మునగ, దోస పంటలకు కూడా నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన వరి నేలపాలు కావడంతో రైతులు వ్యవసాయ అధికారుల ముందు వాపోయారు. నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. రైతు వారీగా సేకరించిన పంటనష్టం వివరాలను కలెక్టర్ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని డీఏవో తెలిపారు.

**మండలాల వారీగా వరికి జరిగిన నష్టం**

| మండలం | ఎకరాలు | మండలం | ఎకరాలు |
|---|---|---|---|
| వర్ని | 101 | కోటగిరి | 66 |
| మోస్రా | 90 | పొతంగల్ | 463 |
| చందూర్ | 425 | బోధన్ | 155 |
| రుద్రూర్ | 15 | సాలూరా | 155 |


### మొరం దందాలో మేయర్ భర్త బైండోవర్

ఖలీల్‌వాడి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మొరం దందాకు పాల్పడుతున్న వారిని బుధవారం తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ మేయర్ నీతూకిరణ్ భర్త దండు శేఖర్‌ను సౌత్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు టౌన్ సీఐ నరహరి తెలిపారు. ఆయనపై అక్రమంగా మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. నాగారం, మల్లారం, బాబన్‌సాహెబ్ పహాడ్ ప్రాంతాల్లో అక్రమ మొరం దందాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉండడంతో బైండోవర్ చేసినట్లు చెప్పారు.

# లిక్కర్ దందాలో మాయాజాలం

లిక్కర్ బ్రాండ్ల కొనుగోళ్లలో మద్యం వ్యాపారులు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నారు. అనుమతి లేకున్నా హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి తీసుకొస్తున్న మద్యాన్ని ఉమ్మడి జిల్లాలోని బార్లలో విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు వస్తున్నా ఎక్సైజ్ శాఖ తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యాపారులు
- సరి'హద్దులు' దాటొస్తున్న అక్రమ మద్యం
- మహారాష్ట్ర, కర్ణాటక, గోవా తదితర రాష్ట్రాల నుంచి తరలింపు
- ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా అమ్మకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మద్యం వ్యాపారుల్లో చాలామంది కల్తీకి పాల్పడుతున్నారంటూ అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. లిక్కర్ బ్రాండ్ల కొనుగోలులోనూ మద్యం వ్యాపారులు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో పైకి అంతా బాగానే కనిపిస్తున్నా.. మద్యం వ్యాపారులు చాలా చాకచక్యంగా మాయాజాలం చేస్తున్నారు. చాలా పద్ధతిగా వ్యాపారం చేస్తున్నట్లు బిల్డప్‌లు మాత్రం ఇస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్వహించిన లాటరీ ద్వారా దుకాణాలు, బార్లు దక్కించుకున్నామని, పారదర్శకంగా వ్యాపారాలు చేస్తున్నామని వ్యాపారులు పేర్కొంటున్నారు. లోనికి వెళ్లి తరచి చూసిన వారికి మాత్రమే వీళ్ల 'జాదూ' వ్యవహారాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఉమ్మడి జిల్లాలోని ఆర్మూర్, బాన్సువాడ, నిజామాబాద్, బోధన్, కామారెడ్డి తదితర ప్రాంతాల్లో లిక్కర్ వ్యాపారులు చేస్తున్న అక్రమాలు అంతా ఇంతా కాదు. నిబంధనలను పూర్తిగా అతిక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ మందుబాబులను కిక్కులోకి దింపుతున్నారు. వీళ్లేమో అనేక రెట్ల లాభాల ఎంజాయ్ చేస్తున్నారు.

**ఐఎంఎల్ డిపో పరిధిని దాటుకుని..**

ఉమ్మడి జిల్లాలోని లిక్కర్ వ్యాపారులు మాక్లూర్ మండలంలోని ఐఎంఎల్ డిపో నుంచి మాత్రమే మద్యం స్టాక్ తెచ్చుకోవాలి. వేరే డిపోల నుంచి తెచ్చుకోవాలంటే సదరు దుకాణాల వాళ్లు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే ఉమ్మడి జిల్లాలో అలాంటి రిజిస్ట్రేషన్ చేసుకున్న వైన్స్, బార్‌ల నిర్వాహకులు లేరు. అయినప్పటికీ కొందరు వ్యాపారులు హైదరాబాద్ నుంచి స్టాక్ తెచ్చుకుంటున్నారు. ఇలా తెచ్చుకునే అవకాశం కేవలం టానిక్స్, ఎలైట్ బార్ వాళ్లకు మాత్రమే ఉంది. కాగా లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు పొందినవారు కూడా ఇతర ప్రాంతాల నుంచి లిక్కర్ స్టాక్ తెచ్చుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. తాజాగా బాన్సువాడలోని ఓ బార్‌లో ఇలా నిబంధనలను అతిక్రమించి హైదరాబాద్ నుంచి తెచ్చిన మద్యం అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి.



బాన్సువాడలోని ఓ బార్‌లో వేరే బార్‌కోడ్‌తో లిక్కర్ బాటిల్

■ లాటరీ పద్ధతిలో లైసెన్స్ పొందిన లిక్కర్ వ్యాపారులు కొందరు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. అటు మందుబాబులను దోపిడీ చేస్తూ ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గత శాసన సభ ఎన్నికల సమయంలో కొందరు వ్యాపారులు తీసుకొచ్చిన గోవా మద్యాన్ని హైదరాబాద్‌లో పట్టుకున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో పలువురు గోవా మద్యం తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరైతే విదేశీ మద్యాన్ని తీసుకొచ్చి అమ్ముతున్నారు. విదేశీ మద్యం తీసుకురావాలంటే రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అలాంటి అనుమతులేవీ లేకుండానే విదేశాల నుంచి బ్రాండ్లను తీసుకొచ్చి వైన్స్, బార్‌ల వ్యాపారులు దందా చేస్తున్నారు. ఈ విషయాలపై నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని వివరణ కోరగా 'వేర్ ఇట్' యాప్ ద్వారా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామన్నారు.

# ఎండలే ఎండలు..



- జిల్లా చరిత్రలో 2005 మే 22న 47.3 డిగ్రీలు నమోదు
- ఈసారి అంతకు మించితే రికార్డు తిరగరాసే అవకాశం
- 45 డిగ్రీలకు చేరితే వడగాల్పులు
- రాత్రివేళ 28 నుంచి 30 డిగ్రీలు ఉంటే ఉక్కపోత

సుభాష్‌నగర్: జిల్లాలో ఈ వేసవిలో ఎండలు మండనున్నాయి. జిల్లా చరిత్రలో నమోదైన రికార్డును మించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు అవకాశముందని వాతావరణశాఖ వర్గాలు భావిస్తున్నాయి. వాతావరణ శాఖ ముందస్తుగానే హెచ్చరించినట్లు భానుడు భగభగ మండుతున్నాడు. సగటున గరిష్ఠ ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరువైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత సైతం సగటు 27.5 డిగ్రీలకు చేరింది. 28 డిగ్రీలు నమోదైతే ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కానున్నారు. ఇష్టారీతిన అడవుల నరికివేత, వాహనాల పొల్యూషన్, ఎల్‌నినో ఎఫెక్ట్, వాతావరణంలో మార్పులు ఎండలు మండేందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్ర వాతావరణశాఖ పరిధిలో గల థర్మోమీటర్ ఆధారంగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొలుస్తారు. గ్రామాలు, మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు ఉంటాయి. వాటి ఆధారంగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలను లెక్కిస్తారు. జిల్లాలో 2022, 2023 వేసవిలో నమోదైన సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**2016 ఏప్రిల్‌లో సగటు రికార్డు 45.1 డిగ్రీలు**

2016 సంవత్సరం ఏప్రిల్ 19న సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 45.1 డిగ్రీలుగా నమోదైంది. ఈ వేసవిలో ఆ రికార్డును మించి ఏప్రిల్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు భావిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే సగటు 42 డిగ్రీలకు చేరువైంది. రెండో వారం నుంచి ఎండలు మరింత ముదురుతాయి. 45 డిగ్రీలు రెగ్యులర్‌గా నమోదైతే కేంద్ర వాతావరణ శాఖ వడగాల్పుల ఎమర్జెన్సీని ప్రకటిస్తుంది. ప్రభుత్వం పలు సూచనలు, సలహాలు చేస్తుంది. ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు.

**వాతావరణంలో విపరీతమైన మార్పులు**

వాతావరణంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విచ్చలవిడిగా అడవులను నరికేయడం, వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, వాయువులు, ఎల్‌నినో ప్రభావం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడానికి ప్రధాన కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు. వర్షాలు విపరీతంగా కురవడం, చలి తీవ్రత పెరగడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం, అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలులు.. ఇవన్నీ వాతావరణంలో మార్పుల ప్రభావంతోనేనని చెబుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. భవిష్యత్ తరాలు ఎలాంటి విపత్తులను ఎదుర్కొంటుందో ఊహాకందడం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**47.3 డిగ్రీలకు మించి నమోదయ్యే అవకాశం!**

కేంద్ర వాతావరణశాఖ చరిత్రలో జిల్లాలో 2005 మే 22న 47.3 డిగ్రీల నమోదైంది. ఇప్పటివరకు అదే అత్యధికం. కానీ ఈసారి అంతకుమించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28 నుంచి 30 వరకు నమోదైతే ఉక్కపోత పెరుగుతోంది. ప్రస్తుతం నమోదవుతున్న కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే రికార్డును బ్రేక్ కావచ్చు. ఇప్పటికే జిల్లాలో ఒకరిద్దరు వడదెబ్బకు గురై మృతిచెందారు. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

| సంవత్సరం | మార్చి | ఏప్రిల్ | మే | జూన్ |
|---|---|---|---|---|
| 2022 | 37.3 | 40.8 | 40.6 | 36.7 |
| 2023 | 35.1 | 37.8 | 39.1 | 32.5 |
| 2024 | 37.5 | - | - | - |

## తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

- ఎక్కడైనా సమస్య ఏర్పడితే సత్వరమే పరిష్కరించాలి
- సీఎస్ శాంతి కుమారి

సుభాష్‌నగర్: తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఒకవేళ ఎక్కడైనా సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వేసవికాలం ముగిసి, వర్షాలు వచ్చే వరకు తాగునీటి సరఫరాను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. ప్రతి జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణాల్లో ఏర్పడిన నూతన కాలనీలు, చివరి ఆవాస ప్రాంతాలు తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని పేర్కొన్నారు. వానాకాలం 2023–24కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, పనుల నిర్వహణ సమయంలో కార్మికులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ట్రైయినీ ఐఏఎస్ కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.

## ఇంటికే సీతారాముల తలంబ్రాలు

- భద్రాచలం కల్యాణ తలంబ్రాలను అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు
- రెండేళ్లుగా ఆఫ్‌లైన్ ద్వారా సేవలందిస్తున్న సంస్థ
- ఈసారి ఆన్‌లైన్ ద్వారా కూడా బుకింగ్ చేసుకునే అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జగదభిరాముడు, సీతమ్మ తల్లి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికే నేరుగా అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ వరుసగా మూడో ఏడాది సేవలను అందజేస్తోంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం ఈ నెల 17న వైభవంగా జరుగనుంది. కల్యాణం కోసం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు సేంద్రియ పద్ధతిలో పండించి, గోటితో వలిచిన కోటి తలంబ్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తూ వస్తోంది. అదేవిధంగా వసంత పంచమి రోజు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ క్రతువులో భాగంగా తలంబ్రాలు కలిపే కార్యక్రమానికి భక్తులతో కలిసి శ్రీకారం చుడతారు.

ఇలా అన్ని తలంబ్రాలను కలిపి సీతారాముల కల్యాణంలో ఉపయోగిస్తారు. భారీస్థాయిలో కలిపిన ఈ తలంబ్రాలను తీసుకెళ్లేందుకు దేశంతో పాటు విదేశాల్లోని వారూ ఇష్టపడతారు. ఈ తలంబ్రాలు ఇంట్లో పెట్టుకుంటే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం. చాలామంది తమ పిల్లల వివాహాలకు వాడే తలంబ్రాల్లో వీటిని కలుపుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

**రూ. 151కే..**



తలంబ్రాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని భక్తుల ఇళ్లవద్దకే వెళ్లి అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం మాడేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. గత రెండేళ్లలో ఆర్టీసీ ఆఫ్‌లైన్ బుకింగ్స్ ద్వారా తలంబ్రాలను అందించే సేవలను చేసింది. ఈ ఏడాది మాత్రం ఆఫ్‌లైన్ బుకింగ్స్‌తో పాటు మొదటిసారి ఆన్‌లైన్ బుకింగ్స్ సదుపాయం ప్రారంభించింది. ముత్యాలతో కూడిన ఒక్క ప్యాకెట్ తలంబ్రాలకు రూ. 151 ధరను నిర్ణయించారు. ప్రతి ఒక్క వ్యక్తి ఆన్‌లైన్‌లో తన మెయిల్ ఐడీ ద్వారా 100 ప్యాకెట్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం www.tsrtclogistics.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలి. అదేవిధంగా ఆఫ్‌లైన్‌లో డిపోల్లోని లాజిస్టిక్స్ కౌంటర్లు, బస్‌స్టేషన్లు, కొన్ని పెద్ద మండల కేంద్రాల్లో లాజిస్టిక్స్ ఏజెంట్ల వద్ద సైతం బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

ఉమ్మడి జిల్లాలో భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం నిజామాబాద్–1 డిపోలో 9154298727, నిజామాబాద్–2 డిపోలో 7396889496, ఆర్మూర్ డిపోలో 9550232626, బోధన్ డిపోలో 9014296638, బాన్సువాడ డిపోలో 9154298729, కామారెడ్డి డిపోలో 9154298730 నంబర్లలో సంప్రదించాలి. అదేవిధంగా భీమ్‌గల్, నందిపేట, బిచ్కుంద, పిట్లం, మద్నూర్, ధర్పల్లి, వర్ని, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాల్లో లాజిస్టిక్స్ ఏజెంట్లను సంప్రదించవచ్చు.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, – శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

## 'ఉపాధి' బకాయిలు రూ. 3.18 కోట్లు

- గత ఫిబ్రవరిలో కూలీలకు నిలిచిపోయిన చెల్లింపులు
- నిధుల విడుదలలో జాప్యమే కారణం



మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలు కూలి డబ్బులు అందడంలేదు. కూలీలకు ప్రతి వారం రోజులకు కూలి సొమ్ము చెల్లించాలని నిబంధన ఉన్నా.. డబ్బుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. గత ఫిబ్రవరి 15 వరకు కూలి సొమ్మును విడుదల చేసినా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. దీంతో రూ. 3.18 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. గతంలో రాష్ట్రాలకు కేంద్రం ఉపాధి నిధులను కేటాయిస్తే ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు నిధులను దారి మళ్లించి కూలీలకు కూలి సొమ్ము జమ చేయడంలో తీవ్రజాప్యం చేసేవి. దీంతో కేంద్రం ఉపాధి హామీ పనుల సాఫ్ట్‌వేర్‌ను మార్చి కూలి సొమ్మును నేరుగా కూలీల ఖాతాల్లోకి జమ చేస్తోంది. కానీ గత రెండు నెలలుగా కూలి చెల్లింపులో ఆలస్యం జరుగుతోంది. ఉపాధి పనులు చేసే కూలీల హాజరును మేట్‌లు నమోదు చేస్తే.. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ల వారీగా రికార్డులను పరిశీలించి మండల కార్యాలయాల్లో అందజేస్తారు. ఇలా అందచేసిన మస్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే వారం రోజుల వ్యవధిలో కూలీల అకౌంట్లో డబ్బులు జమ అయ్యేవి. ఒక్కో కూలీకి గతంలో సగటున రూ. 272 సొమ్ము వచ్చేలా కేంద్రం నిర్ణయించింది. చెరువుల్లో పూడికతీత పనులు, కట్టల ఎత్తు పెంచడం ఇతరత్రా పనులు చేస్తుండడం క్యూబిక్ మీటర్ ధర తక్కువగా ఉండడంతో కూలీలకు రూ. 150 నుంచి రూ. 200ల వరకు మాత్రమే వచ్చేది. ఎంత కూలి వచ్చినా తమకు కొంత ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో కూలీలు తప్పనిసరిగా పనులకు హాజరయ్యేవారు. అయితే ఇటీవల దినసరి కూలిని రూ. 300కు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో గతంలో రోజుకు 25 వేల మంది వరకు కూలీలు పనులకు హాజరవగా ప్రస్తుతం 45వేల మంది వరకు పనులకు వస్తున్నారు. అయితే కూలీల సంఖ్య మరింత పెరగాలంటే కూలి సొమ్మును ఎప్పటికప్పుడు జమచేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి కూలి డబ్బులు చెల్లించాలని.. జాప్యం చేయవద్దని కూలీలు కోరుతున్నారు.

**నిధులు విడుదలవుతాయి**

ఉపాధి కూలీలకు కొంత బకాయిలు పేరుకుపోయిన మాట వాస్తవమే. కూలి సొమ్మును త్వరలో విడుదల చేయనున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. ఇక నుంచి జాప్యం లేకుండా కూలి సొమ్ము జమ చేయవచ్చు.

– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## చొరబాటుదారులకు పౌరసత్వం ఎందుకివ్వాలి

- స్థానిక సమస్యలపై చర్చించడానికే చాయ్‌పే చర్చా కార్యక్రమం
- ఆర్మూర్‌లో రైతులతో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అర్వింద్



ఆర్మూర్‌లో చాయ్‌పే చర్చా కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్: ఇతర దేశాల నుంచి భారత్‌లో చొరబడ్డ అసాంఘిక శక్తులకు పౌరసత్వం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సమంజసమేనా అని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. ఆర్మూర్ పట్టణంలోని మున్నూరుకాపు సంఘ భవనం వద్ద బుధవారం చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రైతులు, యువతతో పలు అంశాలపై చర్చించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లాంటి వారు అడ్డుపడ్డా దేశ వ్యాప్తంగా సీఏఏను అమలు చేస్తామన్నారు. అనంతరం స్థానికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఒక వర్గానికి చెందిన వారు రైతుల పంట పొలాల్లో బోర్లు, పైపులు, వైర్లు ఎత్తుకెళ్లి స్థానికంగా ఇనుప సామాను దుకాణంలో అమ్మడం వల్ల ఇటీవల వారు పోలీసులకు పట్టుబడిన సంఘటన గురించి చర్చించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త రేషన్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వని కారణంగా కొందరికి కిసాన్ సమ్మాన్ డబ్బులు అందడం లేదన్నారు. మనమంతా మోదీ కుటుంబ సభ్యులమంటూ స్థానిక సమస్యలు తెలుసుకోవడానికి చాయ్‌పే చర్చా లాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, పొల్కం వేణు, అమ్దాపూర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సంతానం కోసం పుత్రకామేష్టి యాగం



సాక్షి, హైదరాబాద్: నవమితో పాటు పుష్యమీ నక్షత్రం కలిసివస్తున్న ఈనెల 17న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకులు సత్యవీర్ గురూజీ తెలిపారు. మారిన జీవన విధానాలతో సంతానలేమి సమస్యగా మారిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఆడ, మగ బిడ్డల సంతానం కలిగేందుకు అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తామని తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న వారు తమ వివరాలను 92488 28666 లేదా 79817 50006 నెంబర్లలో నమోదు చేసుకోవాలని సత్యవీర్ గురూజీ కోరారు.

### రంజాన్ శుభాకాంక్షలు




రాజీవ్‌గాంధీ హనుమంతు కల్మేశ్వర్

సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వేసవి తీవ్రతలోనూ నియమనిష్ఠలతో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు నిర్వర్తించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమైన ముస్లిం సోదరులు.. అదే స్ఫూర్తితో గురువారం ఈద్–ఉల్–ఫితర్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### డిగ్రీకళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న సీహెచ్ రాంచందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'మెదక్ జిల్లాలో రాజకీయాలు, రాజకీయ నాయకుల విధివిధానాలు' అనే అంశంపై పరిశోధన చేశారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్‌కు చెందిన రాంచందర్ గత పది సంవత్సరాలుగా ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. డాక్టరేట్ పొందిన రాంచందర్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.



# ఆగని నల్లమట్టి తరలింపు

- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- మూడు టిప్పర్లను పట్టుకున్న నందిపేట పోలీసులు

నందిపేట్(ఆర్మూర్): గోదావరి నదిలో సహజసిద్ధంగా దొరికే నల్లమట్టి అక్రమ తరలింపు ఆగడం లేదు. రైతుల పేరుతో వ్యాపారం చేస్తున్న నల్లమట్టి వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. 20 రోజుల క్రితం నిర్మల్ జిల్లా మోడెం గ్రామ పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి ఉమ్మెడ బ్రిడ్జి మీదుగా ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గ గ్రామాల పరిధిలోని ఆయా గ్రామాల రైతుల కోసం నల్లమట్టిని తరలించారు. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు అప్రమత్తమై గోదావరి మీదుగా నల్లమట్టి తరలించకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. వ్యాపారులు దొడ్డిదారిన రాత్రి వేళల్లో నల్లమట్టిని తరలిస్తున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో టిప్పర్లు

**వన్నెల్ కే మీదుగా..**

గోదావరి బ్రిడ్జి మీదుగా నల్లమట్టిని తరలింపును అడ్డుకోవడంతో.. డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామ సమీపంలోని గోదావరి నుంచి నందిపేట మండలం వన్నెల్ కే మీదుగా ఇతర మండలాలకు తరలిస్తున్నారు. ఎస్సారెస్పీ సహజ సంపద అయిన నల్లమట్టి తరలింపులో విషయంలో ఎస్సారెస్పీ, రెవెన్యూ, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకోవడంతో అక్రమ వ్యాపారులకు అడ్డుకట్ట పడకుండా పోతోంది. చివరికి పోలీసులు రంగంలోకి దిగి నల్లమట్టిని తరలించే వాహనాలను పట్టుకునే పరిస్థితి వచ్చింది. నల్లమట్టి వ్యవహారం గ్రామాల్లో రాజకీయరంగు పులుముకున్నది. పట్టుకున్న వాహనాలను వదిలిపెట్టాలని ఓ పార్టీకి చెందిన వారు ప్రయత్నం చేయగా, మరో వర్గం వారు వదలకూడదని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

**తహసీల్దార్‌కు అప్పగింత**

డొంకేశ్వర్ మండలం అన్నారం నుంచి నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను, నందిపేట బైపాస్ రోడ్డు వద్ద మరో టిప్పర్‌ను బుధవారం స్థానిక పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ వాహనాలను తహసీల్దార్‌కు బైండోవర్ చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

# జిల్లా కోర్టును ప్లాస్టిక్ రహితంగా మార్చాలి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కోర్టును ప్లాస్టిక్ రహిత కోర్టుగా మార్చేందుకు ప్రతి ఒకరూ సహకరించాలని జిల్లా జడ్జి సునీతా కుంచాల అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ఉద్యోగులు, పోలీసులు, న్యాయవాదులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో వాతావరణానికి ముప్పు వాటిల్లుతుందని, భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. అనంతరం వైద్యశిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించగా, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతోపాటు ఇతరులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

**చలివేంద్రం ప్రారంభం**

జిల్లా కోర్టు వద్ద వెలమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని న్యాయమూర్తి సునీతా కుంచాల ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, వెలమసంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఎంఐఎం 'బీ' టీమ్

- ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏది?
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

సుభాష్‌నగర్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంఐఎంను గెలిపించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, మిగతా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మైనార్టీ ఓట్లు వేయించి ఎంఐఎం మద్దతు తెలుపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఎంఐఎం 'బీ' టీమ్ అని అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం ఎమ్మెల్యేల రహస్య ఒప్పందం బయటపడిందన్నారు. మతతత్వ పార్టీ ఎంఐఎంతో కాంగ్రెస్ చేతులు కలిపి మత రాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మూల సిద్ధాంతమైన అంత్యోదయ చిట్టచివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తోందన్నారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని, ఏ నియోజకవర్గానికి ఎన్ని నిధులు కేటాయించారని ప్రశ్నించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఎన్నికల తరువాత విస్మరించిందని విమర్శించారు. గత ఎన్నికల సందర్భంగా ధర్మపురి అర్వింద్ ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు తీసుకొచ్చారని, ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. ముఖ్యంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏడు ఆర్‌వోబీలు, రెండు కేంద్రీయ విద్యాలయాలు తీసుకొచ్చారన్నారు. ఎంపీ నిధుల నుంచి 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమానంగా నిధులు ఇచ్చారని తెలిపారు. అర్వింద్‌కు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ అసలు పోటీయే కాదని, పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో మరోసారి కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో నాయకులు గద్దె భూమన్న, పడిగెల వెంకటేశం, శ్రీనివాస్‌శర్మ, పద్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బద్దం కిషన్, దొంతుల రవి, రోషన్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇప్పకాయల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దినేశ్ కులాచారి

### బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకం



స్వామి యాదవ్

సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాదాసు స్వామి యాదవ్‌ను రెండోసారి నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామియాదవ్ మాట్లాడుతూ.. ఓబీసీ మోర్చా విభాగం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసినందుకు మరోసారి రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనకు అవకామిచ్చారన్నారు. మోదీ ప్రభుత్వం ఓబీసీల కోసం తీసుకొస్తున్న పథకాలను ప్రజలకు వర్తింపజేస్తున్నానని తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె లక్ష్మణ్, మాజీ శాసన సభా పక్షనేత యెండల లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### 26 వరకు 'ఓపెన్' ఫీజు గడువు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2017 సంవత్సరానికి ముందు డిగ్రీలో చేరిన విద్యార్థులు పునఃప్రవేశం పొంది ఈనెల 26వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. మే 6వ తేదీలోగా రూ.200 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మే 17వ తేదీ నుంచి పరీక్షలు ఉంటాయని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు మే 17 నుంచి 20వ తేదీ వరకు.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మూడో సంవత్సరం విద్యార్థులకు 17 నుంచి 22వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మే 24 నుంచి 29వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

### మహిళా జర్నలిస్టుల సంఘం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా మహిళా జర్నలిస్ట్ అసోసియేషన్ ఎన్నికలను బుధవారం నగరంలోని వినాయకనగర్‌లో నిర్వహించారు. అధ్యక్షురాలిగా బైస సంగీత, జనరల్ సెక్రెటరీగా సోని, కోశాధికారిగా అనిత, వైస్‌ప్రెసిడెంట్‌గా ఆశ్ర, సెక్రెటరీగా లావణ్య, కార్యవర్గ సభ్యులుగా వాణి, ప్రసన్న, కావ్య, రోషిణి, సంజన, రజిత ఎన్నికయ్యారు.

## క్రైం కార్నర్

### చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



రవి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దవాగు పక్కన ఉన్న చేపల కుంటలో చేపలు పట్టేందుకు వెళ్లిన అజ్మీర రవి(24) అనే వ్యక్తి బురదలో చిక్కుకొని మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి మండలం రామలక్ష్మణ్‌పల్లి తండాకు చెందిన రవి లింగంపేటలో ఓ వ్యక్తి వద్ద శానిటేషన్ పనులు చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన రవి వద్దకు అతడి తల్లి అజ్మీరా భూలి రాగా, ఇద్దరూ కలిసి పెద్దవాగు వద్ద ఉన్న నారాగౌడ్ చేపలకుంటలో చేపలను వేటాడేందుకువెళ్లారు. ఈ క్రమంలో రవి బురదలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. పోలీసులు బుధవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ట్రాక్టర్ బోల్తా.. కూలీలకు గాయాలు

రామారెడ్డి: మండలంలోని గిద్దెరోడాం సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మండల కేంద్రానికి నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దెనుంచి రామారెడ్డికి వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో శ్రీకాంత్, చతరబోయిన సతీశ్, లచ్చపేట లింబయ్య, భూంపల్లి రాములు చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరి చేతులు విరిగినట్లుగా తెలిసింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### కంటైనర్‌ను ఢీకొన్న బైక్

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పడకల్ తండాకు చెందిన కోల బాపుసింగ్ తన కూతురి ఆధార్‌కార్డు నమోదు కోసం ఆర్మూర్‌కు వెళ్లాడు. అక్కడ పని పూర్తయిన తరువాత పడకల్ తండాకు తిరిగి వస్తుండగా ముందు వెళ్తున్న కంటైనర్‌ను డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో కంటైనర్‌ను బైక్‌ఢీకొని బాపుసింగ్‌తోపాటు అతడి కూతరు ఐశ్వర్యకు స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్సై తిరుపతి పరిశీలించారు. గాయాలపాలైన వారిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### రూ.5.45 లక్షలు పట్టివేత



సీజ్ చేసిన నగదును చూపుతున్న పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని వెల్గనూర్ చెక్ పోస్టు వద్ద పోలీసులు బుధవారం రూ.5.45లక్షల నగదును సీజ్ చేశారు. ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగ, హైదరాబాద్ నుంచి నాందెడ్ వైపునకు వెళ్తున్న బొలెరో వాహనంలో రూ.5.45 లక్షల నగదును గుర్తించారు. నగదు తరలిస్తున్న సమీర్ హుస్సేన్ సాబ్ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

**సలాబత్‌పూర్ వద్ద రూ.లక్ష..**

మద్నూర్(జుక్కల్): మండలంలోని తడి హిప్పర్గాకు చెందిన కంకర్నె సూర్యదాస్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బుధవారం రూ.లక్ష నగదు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సూర్యదాస్ కారులో చెక్‌పోస్టు మీదుగా వెళ్తుండగా తనిఖీ చేసి రూ.లక్ష సీజ్ చేశామన్నారు.

### పీడీఎస్ బియ్యం వేలం

ఇందల్వాయి: దాడుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని డిచ్‌పల్లి మండలం సొంపల్లిలోని సాయిరామ్ రైస్‌మిల్లులో ఈనెల 16వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వెంకట్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 77.86 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు వేలం వేస్తామని, పాల్గొనదలచిన వారు రైస్ మిల్లు వద్దకు రావాలని సూచించారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని మార్నింగ్ కోర్టులో హాజరుపరిచామన్నారు. 10 మందికి రూ.9,800 జరిమానా విధించిన న్యాయమూర్తి.. నగరానికి చెందిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ ధరించాలని సూచించారు.

# ఎన్నికల్లో ఐటీ విభాగానిది కీలకపాత్ర



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

- ఆరోపణలను దీటుగా ఎదుర్కోవాలి
- సోషల్ మీడియాలో చురుగ్గా పని చేయాలి
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్, గోవా ఐటీ, సోషల్ మీడియా అధికార ప్రతినిధి గిరిరాజ్ సూచన

సుభాష్‌నగర్: పదేళ్లల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలపై సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు విస్తృతంగా ప్రచారం చేయాలని, ఎన్నికల్లో తక్కువ వ్యయంతో ఐటీ విభాగం కీలక పాత్ర పోషిస్తోందని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరంలోని వినాయక్‌నగర్ లోగల పాటిగల్లి వినాయక మున్నూరుకాపు సంఘంలో ఐటీ, సోషల్ మీడియా ఆధ్వర్యంలో బుధవారం 'శంఖనాద్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కోసం ప్రతిఒక్కరూ పని చేయాలని, మన మందరం ఆయన కార్యకర్తలమేనన్నారు. తనపై దాడులు జరిగాయని, సోషల్ మీడియా కార్యకర్తలపై దొంగ కేసులు నమోదైనా ఎవరూ వెనకడుగు వేయలేదన్నారు. పార్టీని మరింత బలోపేతం చేశామే తప్ప భయపడలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు దీటుగా ఓట్లు వచ్చాయని, ఈ ఎన్నికల్లో మనకు ఆ పార్టీలు పెద్ద పోటీ కాదన్నారు. అయినప్పటికీ జాగ్రత్తగా ఉండాలని.. తాను మాట్లాడిన మాటలను వక్రీకరించే అవకాశముందన్నారు. కాంగ్రెస్ దొడ్డిదారిన ఇటువంటి దుష్ప్రచారం చేసేందుకు కుట్ర పన్నుతోందని, ఐటీ, సోషల్ మీడియా కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలన్నారు.

గోవా బీజేపీ ఐటీ, సోషల్ మీడియా అధికార ప్రతినిధి గిరిరాజ్ మాట్లాడుతూ.. పార్టీ నాయకులు సోషల్ మీడియాలో చురుగ్గా పని చేయాలని, ముఖ్యంగా వాట్సాప్, ఎఫ్‌బీ, ఎక్స్‌లో పార్టీ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోస్ట్ చేయాలని సూచించారు. వాట్సాప్ కమ్యూనిటీ గ్రూపులు ఏర్పాటు చేసి వ్యక్తిగతంగా సమాచారాన్ని షేర్ చేయాలన్నారు. తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోందని,అత్యంత విలువైన సమాచారాన్ని ప్రచారం చేసేందుకు సోషల్ మీడియా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాపై పోలీస్ నిఘా

- తప్పుడు పోస్టులు పెడితే తప్పదు శిక్ష
- కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు
- సుమోటో కేసులు నమోదు చేయనున్న పోలీసులు



ఖలీల్‌వాడి: సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా ప్రతి అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నది. మంచి సమాచారం ఏ మేరకు అందుతున్నదో.. తప్పు డు (తప్పుడుదోవ పట్టించే అంశాలు) సమాచా రం సైతం అందుకు ఎన్నో రెట్లు ప్రజల్లోకి వెళ్తున్నది. లోక సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వారు, అభ్యర్థుల అభిమానులు సోషల్‌మీడియాలో వివిధ రకాల పోస్టులు పెట్టడం సహజమే. అయితే ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల సంఘం ప్రతి అంశాన్ని పరిశీలిస్తోంది. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి అంశాన్ని ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపై పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. చట్టవ్యతిరేక అంశాలను సామాజిక మాధ్యమాలలో పోస్టు చేస్తే పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయనున్నారు.

**స్మార్ట్‌ఫోన్‌లో హద్దులు దాటితే అంతే..**

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు, ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే పోస్టుల కారణంగా వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతోపాటు ప్రత్యర్థిపార్టీలకు చెందిన అభ్యర్థులను కించపరుస్తూ ఎదుటి పార్టీకి చెందిన వారు మెసేజ్‌లు చేయడం, మార్ఫింగ్ ఫొటోలను షేర్ చేయడం వంటి చర్యల కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలగవచ్చనే ఉద్దేశంతో పోలీసులు నిఘా సారించారు. ఏదైనా గ్రూపులో తప్పడు పోస్టు వస్తే అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రూపులో ఉన్న ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలు అడ్మిన్‌కు తెలియాల్సి ఉంటుంది. గ్రూపులో ఓ వ్యక్తిని చేర్చే ముందు ఆ వ్యక్తి అనుమతి తీసుకోవాలి. లేదంటే సదరు వ్యక్తి పోలీసులకు సమాచారం అందించవచ్చు. అడ్మిన్ అభ్యంతరకర, వివాదాస్పద పోస్టులు పెడితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తారు.

**ఎన్నికల నిబంధనలు పాటించాలి**

ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులు, రాజకీయ నాయకులు అని తేడా లేకుండా అందరికీ నిబంధనలు వర్తిస్తాయి. సోషల్‌మీడియాపై ప్రత్యేక దృష్టి సారించాం. రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తాం.

– నరహరి, సీఐ, నిజామాబాద్ టౌన్

# దెబ్బతిన్న పంటల పరిశీలన

బోధన్/ వర్ని(చందూర్)/ రుద్రూర్: ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పరిశీలించారు. సాలూర మండలంలోని సాలంపాడ్, కుమ్మన్‌పల్లి, చందూర్ మండల కేంద్రంలో, పొతంగల్ మండలం టాక్లీ శివారులో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంటల పరిశీలన చేపట్టారు. పంట నష్టం వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారులు, సొసైటీ సీఈవోలు, సిబ్బంది, రైతులు ఉన్నారు.



టాక్లీ శివారులో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

# ఎడపల్లి ఎంపీవోపై లైంగిక వేధింపుల కేసు

ఖలీల్‌వాడి/ఎడపల్లి: ఎడపల్లి ఎంపీవో సుభాష్ చంద్రబోస్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైనట్లు ఆలస్యంగా తెలిసింది. నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడపల్లి మండలానికి చెందిన ఓ మహిళ కార్యదర్శిని లైంగికంగా వేధించినందుకు ఎంపీవోను నాలుగు రోజుల క్రితం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. లైంగిక వేధింపుల కేసు వాస్తవమేనన్నారు. సదరు ఎంపీవో గతంలో ఓ జిల్లా ఉన్నతాధికారి వద్ద పని చేసిన సమ యంలో ఉన్న పరిచయాలతో సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ శివారులోని వృద్ధాశ్రమం సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.10వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడిలో ఎస్సై అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఐదు గుడిసెలు దగ్ధం

- కొండాపూర్ తండాలో భారీ అగ్ని ప్రమాదం
- రూ.18.33 లక్షల ఆస్తినష్టం

లింగంపేట(ఎల్లారెడ్డి): సుడిగాలి కారణంగా విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగడంతో ఐదు నివాసపు గుడిసెలు దగ్ధమయ్యాయి. మండలంలోని కొంకొండాపూర్ తండాలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఐదు కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డునపడ్డాయి. బంగారం, వెండి, నగదుతోపాటు బియ్యం, ధాన్యం, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.18.33 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ బాలయ్య తెలిపారు. మంజ ప్రకాశ్‌కు చెందిన ఐదు తులాల బంగారం పుస్తెల తాడు, తులన్నర వెండి, రూ.20వేల నగదు, 20 బస్తాల ధాన్యం, మంజ నర్సోడ్‌కు చెందిన రెండు తులాల పుస్తెలతాడు, రూ.50 వేల నగదు, వెండి కడియాలు, మంజ పర్తాశ్‌కు చెందిన మూడు తులాల పుస్తెల తాడు, వెండి కడియాలు, రూ.లక్ష నగదు, మంజ నారాయణకు చెందిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు, వెండి కడియాలు, రూ.50 వేల నగదు, మంజ బాదల్‌సింగ్‌కు చెందిన మక్కలు, డీసీఎం ట్రాలీ పూర్తిగా కాలిపోయాయని ఆర్ఐ తెలిపారు.



దగ్ధమవుతున్న నివాసపు గుడిసెలు

### ఒకరి అదృశ్యం



మేకల చార్లి

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన మేకల చార్లి అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటో నడుపుతూ జీవిస్తున్న చార్లికి భార్య కవిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. 15రోజుల క్రితం బట్టలు సర్దుకుని ఇంటి నుంచి వెళ్లిన చార్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో భార్య కవిత పోలీస్స్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.